పైపులైన్ లీకేజీలు పరిష్కారమయ్యేనా?

- పోచమ్మమైదాన్ వద్ద మూడుసార్లు లీకేజీలు
- రూ.లక్షలతో మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం
- నూతన పైపులైన్ వేయించాలని స్థానికుల మొర

పోచమ్మమైదాన్, నవంబర్ 9: వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్ వద్ద తరచూ పైపులైన్ లీకేజీల వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుమారు మూడు నెలల్లో మూడుసార్లు తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో నీరంతా వరదలా రోడ్డుపై ప్రవహిస్తున్నది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పైపులైన్ మరమ్మతుల కోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా శాశ్వత మరమ్మతులు చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం ఒకసారి, గత నెలలో రెండుసార్లు రూ.లక్షన్నర ఖర్చుతో పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. తాజాగా మూడు రోజుల క్రితం ఇదే పరిస్థితి ఏర్పడంతో మళ్లీ పైపులైన్ కోసం గుంతలు తవ్వించారు. దీంతో మళ్లీ రవాణా సౌకర్యానికి బ్రేక్ పడింది. స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ డీఈ రంగారావు

మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కుమారస్వామి, డీఈ రంగారావు

ఆధ్వర్యంలో పైపులైన్ మరమ్మతులను తాత్కాలికంగా పూర్తి చేయించారు. ఆదివారం నుంచి నల్లాల ద్వారా తాగునీటి సరఫరా అవుతుందని భావిస్తున్నారు.

పాతకాలం నాటి పైపులైన్‌తో పరేషాన్

పోచమ్మమైదాన్ నుంచి దేశాయిపేట రోడ్డు మార్గంలో వేసిన పైపులైన్ పాతకాలం నాటిది కావడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం వేసిన పైపులు పాతప

రోడ్డుపై గుంత తవ్వడంతో నిలిచిన రాకపోకలు

డిపోవడంతోపాటు ఆనాడు రబ్బర్ వాచర్లు వాడడం వల్ల పైపులైన్ల జాయింట్స్ ఊడి లీకేజీ ఏర్పడుతున్నట్లు చెబుతున్నారు. దీనివల్లే ఈ మార్గంలో ఉన్న నాలుగు పైపులైన్లకు లీకేజీలు ఏర్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే, మళ్లీ లీకేజీలు ఏర్పడకుండా ఈసారి తగరంతో కూడిన ప్యాకింగ్ చేశామని చెప్పారు. అయినా లీకేజీలు ఏర్పడితే ఏమీ చేయలేని చెప్పారు. ఇదిలా ఉంటే నూతన పైపులైన్ వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

నిరసన తెలిపిన ఆయకట్టు రైతులు

గుంతలమయమైన రోడ్డును చూపుతున్న రైతులు

ఖానాపురం, నవంబర్ 9: మండలంలోని బండమీదిమామిడి తండా శివారు నుంచి పంట పొలాలకు వెళ్లే ఆయకట్టు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరారు. గుంతలమయంగా మారి న రోడ్డు వద్ద శనివారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఆబోత్ అశోక్, బోడ వెంకన్న, మోతీలాల్ మాట్లాడుతూ బండమీదిమామిడితండా, మనుబోతులగడ్డ గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలకు వెళ్లే ఆయకట్టు రోడ్డంతా గుంతలమయంగా మారిందన్నారు. నడవలేని పరిస్థితి ఉందని, వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యంతో కొనుగోలు కేంద్రానికి లారీలు, డీసీఎంలు వెళ్లాలంటే చాలా కష్టమన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆయకట్టు రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవీలాల్, వాగ్య, రవి, శ్రీను, నవీన్, సురేశ్, సంపత్, రాము, బిచ్చ, నీలమ్మ, సర్వర్ మియా పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, నవంబర్ 9: మైలారం గ్రామానికి చెందిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఫార్మ్యూన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్స్ అధినేత, సామాజిక సేవా కార్యకర్త, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సారథ్యంలో శనివారం ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సుమారు 500 మంది తన అనుచరులతో కలిసి ప్రత్యేక వాహనాల్లో ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌కు చేరుకున్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డికి కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునావత్ నర్సింహనాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, గారె నర్సయ్య, నయూం, పూస మధు, లేతాకుల మధుకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బిల్లా వెంకట్‌రెడ్డి, ఏ శ్రీనివాస్ రెడ్డి, సంది వంశీధర్‌రెడ్డి, అమ్మిరెడ్డి, భూక్యా సురేందర్‌రాథోడ్ పాల్గొన్నారు.

కోటను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

శిల్పాలను పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి సుజోయ్‌పాల్

ఖిలావరంగల్, నవంబర్ 9: హైకోర్టు న్యాయమూర్తి సుజోయ్‌పాల్ దంపతులు శనివారం కోటను సందర్శించారు. కాకతీయుల చరిత్ర, కట్టడాలు తదితర అంశాలపై జడ్జికి టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, గైడ్ రవియాదవ్ వివరించారు. అనంతరం టీజీటీడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌండ్ అండ్ లైట్స్ షోను తిలకించారు. ఆయన వెంట జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్, కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, సౌండ్ అండ్ లైట్స్ షో మేనేజర్ అజయ్, ఏఎస్సై కోట ఇన్‌చార్జి కొత్తపెల్లి శ్రీకాంత్ ఉన్నారు.

WANTED
(FEMALE CANDIDATES)
• 1st to 5th Class Qualified English Teachers
• Computer / D.T.P Operators (English, Telugu and Hindi Typing)
• Salary - Rs. 15000/-
Contact Immediately : 80082 73888

నవోదయ దరఖాస్తుల గడువు పొడిగింపు

కరీమాబాద్: జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆదేశానుసారం 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగించారు. ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పూర్ణిమ సూచించారు.

అంతర్జాతీయ శిక్షణకు ఎంజీఎం నర్సు

నౌషీన్ నాజ్

వరంగల్‌చౌరస్తా, నవంబర్ 9: మాతాశిశు మరణాలను పూర్తిగా నిర్మూలించేందుకు జపాన్ చేపడుతున్న చర్యలను వివరించడానికి ఏర్పాటు చేసిన అంతర్జాతీయ శిక్షణ శిబిరానికి వరంగల్ ఎంజీఎం మిడ్ వైఫరీ నర్సు నౌషీన్ నాజ్ ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. భారత్‌తో జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఏజెన్సీ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ నెల 12 నుంచి 24 వరకు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మన దేశం నుంచి కేవలం ఏడుగురు మాత్రమే ఈ శిబిరానికి హాజరు కానున్నారని, ఐదుగురు ఉత్తర భారతదేశానికి చెందిన వారు కాగా, ఇద్దరు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారని తెలిపారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామస్వామి

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఖానాపురం, నవంబర్ 9: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్ కోరారు. ఐనపల్లి, మనుబోతులగడ్డ, బండమీదిమామిడితండా, అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. సొసైటీ డైరెక్టర్లు ఆబోత్ అశోక్, వేములపల్లి సునీత, సొసైటీ సీఈవో ఆంజనేయులు, సిబ్బంది రాజు, వినయ్, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి, నవంబర్ 9: నిజాన్ని నిర్భయంగా మాట్లాడి, ప్రజలకు వాస్తవాలు చెబుతున్న జర్నలిస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి వేధించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొగర్రాయికి చెందిన జర్నలిస్టు రంజిత్‌రెడ్డిపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, బేషరతుగా విడుదల చేయాలని పెద్ది డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రశ్నించిన ఎంతో మంది జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం, వేధించడం పరిపాటిగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న దద్దమ్మ పనులను నిలదీసినందుకు రంజిత్‌ను ప్రభుత్వం నిర్బంధించిదని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి స్థాయిని మరిచి అసభ్య పదజాలం వాడుతున్న రేవంత్‌రెడ్డిపై కేసులు పెట్టాలని పెద్ది డిమాండ్ చేశారు.

'న్యాయమూర్తులను నియమించాలి'

జస్టిస్ సృజన్‌పాల్, మౌషమి భట్టాచార్యను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

నర్సంపేట, నవంబర్ 8: నర్సంపేట కోర్టులో ప్రస్తుతం రెగ్యులర్ ఆఫీసర్ లేక కక్షిదారులు చాలా ఇబ్బంది పడుతున్నారని, వెంటనే మూడు కోర్టుల్లో రెగ్యులర్ న్యాయమూర్తులను నియమించాలని నర్సంపేట బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సృజన్‌పాల్, మౌషమి భట్టాచార్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి, కార్యదర్శి చిలువేరు కిరణ్, మోటూరి రవి, రాజ్‌కుమార్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఏజీపీ బండి శివ, రంగనాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

13న సత్యనారాయణస్వామి వ్రతాలు

సప్తధామంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పోచమ్మమైదాన్, నవంబర్ 9: వరంగల్ ములుగురోడ్డులోని సప్తధామంలో ఈ నెల 13న సమష్టి శ్రీరమా సత్యనారాయణస్వామి వ్రతాలను 251 మంది జంటలతో నిర్వహించనున్నట్లు శివానందగురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. గురుధామంలో శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. భక్తులందరికీ భోజనం సదుపాయం ఉంటుందని, జంటలు సంప్రదాయ దుస్తుల్లో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టీలు బండారా సాయి నారాయణ, మాదారపు సదాశివుడు, రేపాల రామచందర్, గందె ఉమాశంకర్, పబ్బతి నరేశ్ పాల్గొన్నారు.

పంట చేనులోనే ఆగిన రైతు గుండె

రాజాలు(ఫైల్)

సంగెం, నవంబర్ 9: పంట చేనులోనే ఓ రైతు గుండె ఆగిన ఘటన మండలంలో శనివారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ముంద్రాయి గొల్లపల్లికి చెందిన రైతు ఎల్లబోయిన రాజాలు(52) శనివారం ఉదయం తను సాగు చేసిన బెండ చేనులో బెండకాయలు కోసి ఇంటికి తీసుకొచ్చాడు. తిరిగి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి బెండ చేనులో నాగలితో దున్నుతున్నాడు. ఈ క్రమంలో గుండెపోటుకు గురయ్యాడు. తోటి రైతులు గమనించి చెట్టునీడకు తీసుకొచ్చి సీపీఆర్ చేశారు. బండిపై అతడిని ఇంటికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య పుష్ప, కుమారుడు శ్రీకాంత్, కుమార్తె అనూష ఉన్నారు.

సొసైటీలో విచారణకు నోటీసులు

- పీఏసీఎస్‌లో భారీగా అవకతవకలు
- ఆరు నెలల్లో రూ. 65 లక్షలు ఖర్చు చేసిన పాలకవర్గం
- పెట్రోల్ బంక్‌లో కూడా అదే తంతు

చెన్నారావుపేట, నవంబర్ 9: మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేయగా, విచారణకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. చెన్నారావుపేట సొసైటీలో ఇటీవల అనేక అవకతవకలు జరిగాయని, కోట్లాది రూపాయలను ఇష్టారాజ్యంగా ఖర్చు చేసినట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. సహకార సంఘంలో పాలకవర్గ సభ్యులు గత ఆరు నెలల కాలంలో రూ.65లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపిస్తున్నారు. పలు సందర్భాల్లో సహకార సంఘం పరిధిలోని గోదాముల రిపేరు పేరుతో సుమారు రూ.35లక్షలను చెక్కుల ద్వారా డైరెక్టర్లు తీసుకున్నట్లు లెక్కలు రాసి ఉన్నాయి. పెయింటింగ్, ఇతర ఖర్చుల రూపంలో ఇంత పెద్ద మొత్తంలో డబ్బు వృథా చేయడాన్ని రైతులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇటీవల నిర్మించిన గోదాముకు దాత స్థలాన్ని విరాళంగా ఇచ్చినట్లు శిలాఫలకంపై ఉంది. కానీ, ఆ స్థలం కోసం రూ.5లక్షలు వెచ్చించినట్లు లెక్కల్లో చూపించడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నదని సదరు స్థల దాత వాపోతున్నాడు. అలాగే, సహకార సంఘానికి అనుబంధంగా ఉన్న పెట్రోల్ బంక్‌లో కూడా చాలా అవకతవకలు జరిగినట్లు తెలుస్తున్నది. డివిజన్‌స్థాయి నాయకులతోపాటు మండల నాయకులు, పెద్దలు పెట్రోల్ బంక్‌కు చెల్లించాల్సిన బకాయిలు చాలానే ఉన్నాయని తెలిసింది. పెట్రోల్ బంక్‌లో ఇష్టారాజ్యంగా ఉద్దెర రూపంలో పెట్రోల్ పోసి బకాయిలు వసూలు చేయకుండా దివాలా దిశగా తీసుకెళ్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విచారణ జరిపి రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర వ్యతిరేకత
- మూసీ ప్రక్షాళనకు వేల కోట్ల నిధులు ఎక్కడి నుంచి తెస్తారు
- బీజేపీ నాయకులు సీతారాంనాయక్, పుల్లారావు

మాట్లాడుతున్న సీతారాంనాయక్, పుల్లారావు

ఖానాపురం, నవంబర్ 9: గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, కంభంపాటి పుల్లారావు అన్నా రు. శనివారం బుధరావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ఏడాదిలోనే దివాలా తీయించాడని విమర్శించారు. రేవంత్ పాలనపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. రైతులను మభ్యపెట్టి ఓట్లేయించుకున్న కాంగ్రెస్ సర్కారు రైతుబంధుకు రాంరాం పలికిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తన స్థాయిని మర్చిపోయి మాట్లాడుతున్న భాషను చూసి ప్రజలు విస్మయం చెందుతున్నారన్నారు. హామీలను నెరవేర్చేందుకు నిధులు లేవని తప్పించుకు తిరుగుతున్న సీఎం మూసీ ప్రక్షాళనకు వేల కోట్ల రూపాయల నిధులను ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని, మూసీ పేరుతో పేదల ఇళ్లను ఎలా కూల్చేస్తారని ప్రశ్నించారు. అన్ని అనుమతులు ఉన్న ఇళ్లను కూల్చేయడం అన్యాయమన్నారు. జల్లి మధు, రాము, జగన్, శ్రీనివాస్, పుల్లయ్య, రాజేందర్, మల్లారెడ్డి, రమేశ్, లక్పతి, రాములు, నరేశ్ పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో కార్తీక వారోత్సవాలు

బ్యానర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పోచమ్మమైదాన్, నవంబర్ 9: టీటీడీ ఆధ్వర్యంలో కార్తీక మాస వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. హనుమకొండ భవానీనగర్‌లోని శ్రీభవానీమాత ఆలయంలో ఈ నెల 11 నుంచి 17 వరకు కార్తీక పురాణ సప్తాహ కార్యక్రమాలు జరపనున్నట్లు నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు ప్రచార బ్యానర్‌ను శనివారం ఆవిష్కరించారు. టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ కనపర్తి రఘువీర్‌రావు, ఆలయ చైర్మన్ గుడి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కలకుంట్ల మురళీధర్‌రావు, కార్యదర్శి రాజమౌళి, ప్రొఫెసర్ గుడా నరసింహమూర్తి, ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పిల్లలపై లింగ వివక్ష చూపొద్దు

మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజుద్దీన్

గీసుగొండ, నవంబర్ 9: తల్లిదండ్రులు పిల్లల పెంపకంతోపాటు చదవించడంలో లింగ వివక్ష చూపొద్దని తహసీల్దార్ రియాజుద్దీన్ అన్నారు. కోనాయిమాకులలో శనివారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆడపిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. ప్రాజెక్టు మేనేజర్ కవిరాజు, కో ఆర్డినేటర్ ఇందిర, అక్తర్, సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో రైతులకు అధిక లాభాలు

రైతులకు అవగాహన కల్పిస్తున్న సంగీతలక్ష్మి

దుగ్గొండి, నవంబర్ 9: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందుతారని ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. పోనకల్‌లో రైతు బుస్సారి బాబురావు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను శనివారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామ్ చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ సతీశ్ నారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ అనిల్‌కుమార్, దేవరాజ్, రైతులు పాల్గొన్నారు.

జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు సర్వంసిద్ధం

రాయపర్తి, నవంబర్ 9: మండలకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ఆవరణలో ఈ నెల 11 నుంచి 14వ దీ వరకు నిర్వహించనున్న 10వ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్ 2024-25కు సర్వం సిద్ధం చేసినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ మల్టీ జోనల్ ఆఫీసర్-1 కాంపాటి అలివేలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను వరంగల్, హనుమకొండ డీసీవోలు పోతుల అపర్ణ, దాసరి ఉమామహేశ్వరి, గురుకుల ప్రిన్సిపాళ్లు సముద్రాల సరిత, రాయరాకుల సమ్మయ్యతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్, హనుకొండ, మహబూబాబాద్ జిల్లాల్లోని 14 బాలికల గురుకులాలకు చెందిన 1190 క్రీడాకారిణులు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. వారి వెంట స్పోర్ట్స్ మీట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కళమ్మ, కోఆర్డినేటర్ ప్రభావతి, పీఈటీ హేమలత, అలుగు రమ్యసుధ, సృజన, కల్పన, లీల, జ్యోతి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఖానాపురం/నర్సంపేట, నవంబర్ 9: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. రాగంపేటలో శనివారం ఆయన ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆదివారంలోగా అర్హులు దరఖాస్తులు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వో తడుగుల సంధ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆర్డీవో ఉమారాణి పరిశీలించారు. యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి'

నర్సంపేటరూరల్, నవంబర్ 9: అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడం మల్లేశం అన్నారు. నర్సింగాపురంలో శుక్రవారం రాత్రి అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ధ్వజమెత్తారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి, డివిజన్ కార్యదర్శి ఈరెల్లి రాంచందర్, నాయకులు శివరాత్రి కుమార్, ప్రసాద్, ఎల్లన్న, అనిల్, శంకర్, రాజు, జితేందర్, మధు, సదానందం, మహేందర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

పర్వతగిరి, నవంబర్ 9: లయన్స్ క్లబ్ హనుమకొండ ట్రైసిటీ శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు శనివారం శానిటరీ ప్యాడ్స్, బీపీ ఆపరేటర్, థర్మల్ స్క్రీనర్ వెయింగ్ మిషన్‌ను ఉచితంగా అందజేశారు. ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ హనుమకొండ ప్రతినిధులు పీఆర్వో కటంగోరు రాంగోపాల్‌రెడ్డి, జోనల్ చైర్మన్ గుండా వాసుదేవ్, పెట్రోజు సురేశ్‌బాబు, ట్రైసిటీ క్లబ్ ప్రెసిడెంట్, రోళ్లకల్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం, కేజీబీవీ ప్రత్యేకాధికారి నాజియా సల్మా, సీఆర్టీలు ఎమ్మార్సీ స్టాఫ్ గారె జయరాజ్ పాల్గొన్నారు.

'కౌశిక్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం'

గీసుగొండ, నవంబర్ 9: దళితబంధు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించే అధికారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి లేదా అని, రాష్ట్రంలో ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని దళితబంధు మండల అధ్యక్షుడు కోటా ప్రమోద్ ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తులు స్వీకరించేందుకు వచ్చిన ఎమ్మెల్యేను పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎంకు చిత్తశుద్ధి ఉంటే రెండో విడుత దళితబంధు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పశువైద్య శిబిరాలు

సంగెం/ రాయపర్తి, నవంబర్ 9: జిల్లాలో శనివారం పలు చోట్ల పశువైద్య శిబిరాలు నిర్వహించారు. సంగెం మండలం ఆశాలపల్లిలో 55 పశువులకు గర్భకోష వ్యాధులకు వైద్యం చేశారు. 15 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ నరేశ్ పరిపెల్లి, డాక్టర్ రాజేశ్‌రెడ్డి, సిబ్బంది శుకుమియా, రమేశ్, వీరేశం, ఆర్‌సీఎఫ్ సురేశ్‌కామ్‌బెల్, ఇందిరజిత్‌సింగ్, పురుషోత్తం రతియ పాల్గొన్నారు. రాయపర్తి మండలం కొలన్‌పల్లిలో మండల పశువైద్యాధికారి వీరగోని శ్రుతి సారథ్యంలో పశువులు, బర్రెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు, చికిత్సలు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

కాశీబుగ్గ, నవంబర్ 9: వరంగల్ 14వ డివిజన్ శ్రీనివాసకాలనీ వంద ఫీట్ల రోడ్డులోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎనుమాముల సీఐ అల్లె రాఘవేందర్ కథనం ప్రకారం.. శ్రీనివాసకాలనీకి చెందిన ఎండీ యాకూబ్‌పాషా శుక్రవారం ఉదయం తన భార్యాపిల్లలతో కలిసి బయటకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ రాఘవేందర్, ఎస్సై పోగుల శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బీరువాలోని ఐదున్నర తులాల బంగారం, అరకిలో వెండి చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు.

గోడ కూల్చిన వారిపై కేసు నమోదు

ఖిలావరంగల్, నవంబర్ 9: గోడ కూల్చిన ఒకరిపై కేసు నమోదు చేసిట్లు మిల్స్‌కాలనీ సీఐ జే వెంకటరత్నం తెలిపారు. కరీమాబాద్ నానామియతోటలో ఎండీ ఖలీల్‌కు చెందిన స్కూల్ ప్రహరీ, సెక్యూరిటీ గార్డు గది తన స్థలంలో ఉందని అదే ప్రాంతానికి చెందిన ఎస్డీ అన్వర్‌తోపాటు మరికొంత మంది కూల్చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే, ఖిలావరంగల్‌కు చెందిన నలిగంటి బాలయ్య తన 11 మేకలను మేత కోసం అదే ప్రాంతంలోని మైదానానికి తరలించాడు. వ్యక్తిగత పనిపై ఇంటికి వెళ్లి తిరిగొచ్చేసరిగి మేకలు కనిపించలేదని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మ